సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం, 10, జనవరి, 2025



గడువులోగా రైల్వే అభివృద్ధి పనులు

కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అధికారులను ఆదేశించారు. -12లో



ఐదుగురికి యావజ్జీవ కారాగార శిక్ష

మైలవరం మండల పరిధిలోని తొర్రివేముల గ్రామం వద్ద ఐదేళ్ల క్రితం జరిగిన హత్య కేసులో ఐదుగురికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. -12లో

గరిష్టం/కనిష్టం
28.0/16.8

వాతావరణం

జిల్లాలో గురువారం 16.8 - 28.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

11 నుంచి కళాశాలలకు సంక్రాంతి సెలవులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య ఇంటర్ జూనియర్ కళాశాలకు 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులుగా ప్రకటించినట్లు ఇంటర్మీడియట్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. 20వ తేదీ కళాశాలలు పునః ప్రారంభమవుతాయని వివరించారు. అదే రోజు నుంచి 25వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతాయన్నారు. సెలవుల్లో ఎవరైనా తరగతులు నిర్వహిస్తే ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీసీఆర్‌సీ కార్డుదారులకు పంట రుణాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో సీసీఆర్‌సీ కార్డులున్న కౌలు రైతులు పంట రుణాలు తీసుకోవచ్చని జిల్లా లీడ్‌బ్యాంకు చీఫ్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులు తమ ఖాతా ఉన్న బ్యాంకును సంప్రదించి రుణాలు పొందవచ్చని పేర్కొన్నారు. రుణాల మంజూరుకు సంబంధించి జిల్లాలోని అన్ని బ్యాంకులకు మార్గదర్శకాలను జారీ చేశామని ఆయన తెలిపారు. బ్యాంకును సంప్రదించినపుడు ఏదైనా ఇబ్బందులు ఉంటే 08562-242397 నెంబరులో సంప్రదించాలన్నారు. సంబంధిత పొలంపై భూమి యజమానులు పంట రుణం తీసుకోకుండా ఉంటేనే కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు ఇస్తాయని ఆయన వివరించారు.

చదరంగం పోటీల్లో జిల్లా క్రీడాకారిణుల ప్రతిభ



చదరంగంలో రాణించిన జిల్లా క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్: చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు జరిగిన చెన్నై ఇంటర్నేషనల్ క్లాసికల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. బాలికల విభాగంలో అండర్-15 కేటగిరీలో తేజోమయి రెండో స్థానం, అండర్-9 కేటగిరీలో అమీనా 3వ స్థానం, అండర్-13 కేటగిరీలో లాస్యశ్రీ 4వ స్థానం, అండర్-11 కేటగిరీలో దీపిక 8వ స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో రేటెడ్ క్రీడాకారుడు అనురాగ్, ప్రేమ్‌దీప్‌లు సైతం చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకున్నారని జిల్లా చదరంగం కార్యదర్శి అనీస్ దర్బారీ పేర్కొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని రెండు బార్లు, ఒక ప్రీమియం స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తులను ఈ నెల 18 వరకు పొడిగించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో రెండు బార్లు, ఒక ప్రీమియం స్టోర్‌కు ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. జనవరి 7 వరకు ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో గడువును మరోసారి పొడిగించినట్లు తెలిపారు.ప్రీమియం స్టోర్‌కు దరఖాస్తుదారుడు నాన్ రిఫండబుల్‌గా రూ. 15 లక్షలు డీడీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలాగే స్టోర్ దక్కించుకున్న వారు లైసెన్స్ కింద రూ. కోటి చెల్లించాలన్నారు. లైసెన్స్ వచ్చిన తరువాత 4 వేల చదరపు అడుగుల్లో స్టోర్ రూమ్ ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

'నేషనల్ యంగ్ లీడర్ డైలాగ్'కు జిల్లా యువత



పి.దస్తగిరిబాషా



ఎం.లోహిత్‌ఈశ్వర్‌రెడ్డి

కడప స్పోర్ట్స్: దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న యూత్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన ఇద్దరు యువకులకు అవకాశం దక్కింది. యూత్‌ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించే 'నేషనల్ యంగ్ లీడర్ డైలాగ్' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ చదువుతున్న లోహిత్ ఈశ్వర్‌రెడ్డి, పి. దస్తగిరి బాషా ఎంపికయ్యారు. వీరితో పాటు ఇప్పటికే కడప నగరానికి చెందిన ఎస్. సానియా సైతం ఇదే కార్యక్రమానికి ఎంపికైన సంగతి తెలిసిందే. జిల్లాకు చెందిన ముగ్గురు యువత జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్‌కు ఎంపికవడంపై నెహ్రూ యువకేంద్రం జిల్లా సమన్వయకర్త మణికంఠ అభినందనలు తెలిపారు.

సయ్యద్ సానియాకు అభినందనలు

కడప ఎడ్యుకేషన్: కడప నగరం కోటిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల చెందిన సయ్యద్‌సానియా నేషనల్ యూత్ ఫెస్టివల్ 2025కు ఎన్నికైన సందర్భంగా విద్యా క్రీడా సాంస్కృతిక అభివృద్ధి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు లయన్ పటాన్ ఖాదర్బాషా, షేక్ అమానుల్లా అభినందించారు. ఆడపిల్లలను ప్రోత్సహిస్తే ఇలాంటి ఆణిముత్యాలుగా తయారవుతారని కొనియాడారు.



మీనమేషాలు!

- చెరువుల్లో చేప పిల్లల విడుదలకు ఇంకా నిర్వహించని టెండర్లు
- గతేడాది ఈపాటికే రిజర్వాయర్లు, చెరువులకు చేరిన చేప పిల్లలు
- ఆలస్యమైతే చెరువుల్లో నీరుతగ్గే అవకాశం
- ఆందోళనలో మత్స్యకారులు



కడప మత్స్యశాఖ కార్యాలయం వద్ద నీటి తొట్లలో పెంచుతున్న చేప పిల్లలు

కడప అగ్రికల్చర్: జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లల విడుదల కార్యక్రమం ఈ ఏడాది ఆలస్యమవుతోంది.చేప పిల్లల విడుదలకు సంబంధించిన టెండర్ల నిర్వహణ ప్రక్రియే ఇంకా చేపట్టకపోవడంపై మత్స్యకారుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఏడాది వర్షాలు బాగా కురిశాయి. జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువుల్లో జలకళ సంతరించుకుంది. మత్స్య శాఖ మాత్రం ఇంకా చేప పిల్లలను విడుదలలో 'మీన' మేషాలు లెక్కిస్తూనే ఉంది. చెరువుల్లో చేపపిల్లల విడుదలకు ప్రభుత్వం నుంచి ఇటీవలే గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో ఇప్పటికిప్పుడు హడావుడి చేసినా వదలడానికి చేప పిల్లలు సిద్ధంగా లేవు. అందువల్లే ఈ ఏడాది చేప పిల్లల విడుదల ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.

కడప, మఠంలో చేప పిల్లల పెంపకం....

కడపలోని మత్స్యశాఖ కార్యాలయం వద్ద సిమెంట్ తొట్లలో 6.5 లక్షలు, బి.మఠంలోని నర్సరీలో 12.50 లక్షల చేప పిల్లలను జాలర్లు పెంచుతున్నారు. సాధారణంగా వీటిలో పెంచుతున్న చేప పిల్లలను ఏటా బ్రహ్మంసాగర్, సోమశిల, గండికోట రిజర్వాయర్లలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో వదులుతారు. ఈ కార్యక్రమాన్ని గతేడాది జనవరి 5వ తేదీలోపు ముగించారు. కానీ ఏడాది జనవరి 10వ తేదీ వచ్చినా చేపట్టలేదు. ఈ కార్యక్రమం ఇంకా ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది.

జిల్లావ్యాప్తంగా సొసైటీ చెరువులు

మరోవైపు జిల్లావ్యాప్తంగా మత్స్యశాఖ పరిధిలోని 33 సొసైటీలు ఉన్నాయి. వీటి పరిధిలో 8 రిజర్వాయర్లు 159 సొసైటీ చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రస్తుతం రిజర్వాయర్లతోపాటు 44 చెరువుల్లో నీరు ఉన్నట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. ఈ చెరువులు, రిజర్వాయర్లలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో చేప పిల్లలను పెంచనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం కొంత సబ్సిడీ ఇవ్వనుండగా మిగతా డబ్బులను మత్స్యకారులు చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ఈ ఏడాది 40 లక్షల చేప పిల్లలను చెరువులు, రిజర్వాయర్లలో వదలనున్నట్లు అధికారులు తెలిపారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత



కడపలోని మత్స్యశాఖ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ముఖ్యంగా అన్ని కార్యక్రమాలను పర్యవేక్షించే డిప్యూటీ డైరెక్టర్(డీడీ) నాలుగు నెలల నుంచి సెలవులో ఉన్నారు. దీంతోపాటు జిల్లాలో నలుగురు ఎఫ్‌డీఓలు ఉండాల్సి ఉండగా కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఆయన కార్యాలయ పనులను పర్యవేక్షణకే పరిమితం కావాల్సి వస్తుంది. అలాగే విలేజ్ ఫిషరీ అసిస్టెంట్లు ఎనిమిది మంది ఉండాల్సి ఉండగా ఆరుగురు మాత్రమే ఉన్నారు. ఇంకా రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో కొంత పర్యవేక్షణ తగ్గి చేప పిల్లల విడుదలలో ఆలస్యం చోటు చేసుకున్నట్లు కూడా కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం తిరుపతి డీడీగా పనిచేస్తున్న నాగరాజును వైఎస్సార్‌జిల్లాకు ఇన్‌చార్జ్ డీడీగా కేటాయించారు.

మత్స్యకారుల్లో ఆందోళన



నీటితో కళకళలాడుతున్న ఖాజీపేట మండలం రావులపల్లి చెరువు

జిల్లావ్యాప్తంగా వందల సంఖ్యలో చెరువులు ఉన్నాయి. ఈ ఏడాది వర్షాలు బాగా కురవడంతో అందులో చాలా వరకు జలకళసంతరించుకున్నాయి. ఆయా చెరువుల్లో చేప పిల్లలు వదలడానికి టెండర్లను నిర్వహిస్తారు. టెండర్లను ఎవరు దక్కించుకుంటే వారే తెచ్చి ఆయా చెరువుల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను విడుదల చేస్తారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఇటీవల నిర్వహించినా కొన్ని అనివార్య కారణాలతో ఆ టెండర్లను రద్దు చేశారు. ఆ తర్వాత టెండర్ల ఊసే లేదు. మరి ఆ టెండర్లను ఎప్పుడు నిర్వహిస్తారో.. చేప పిల్లలను ఎప్పుడు వదులుతారో తెలియని పరిస్థితి నెలకొంది. మరీ ఆలస్యమైతే చెరువుల్లో నీరు తగ్గిపోతుందేమోనన్న ఆందోళన మత్స్యకారుల్లో ఉంది.

త్వరలో చేప పిల్లలను వదులుతాం...



చెరువులకు చేప పిల్లలు వదిలిపెట్టడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. జిల్లాలోని మత్స్యశాఖ పరిధిలోని సొసైటీ చెరువులతో పాటు రిజర్వాయర్లలో చేప పిల్లలు వదలనున్నారు. ఇందుకు సంబంధించి 40 లక్షల చేప పిల్లలు అవసరం ఉంది. వీటిని సంబంధించి టెండర్ల నిర్వహణ అనంతరమే చేపపిల్లలను వదిలిపెట్టే ప్రయత్నం చేస్తాం. అలాగే మత్స్యశాఖ పరిధిలో పెంచే చేప పిల్లలను త్వరలో బ్రహ్మసాగర్, సోమశిల, గండికోట రిజర్వాయర్లలో వదులుతాం. - నాగరాజు, మత్స్యశాఖ ఇన్‌చార్జ్ అధికారి

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం



రంగు రంగుల పుష్పాలంకరణలో బాలాలయం

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాస్వామి దేవాలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి ని పురస్కరించుకుని టీటీడీ వారు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు.భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లను రామాలయ అంకణాలలో నుంచి వైకుంఠ ద్వారానికి చేరుకునే విధంగా ఏర్పాటు చేశారు. అంకాణాలకు రంగురంగుల విద్యుత్ దీపాలను అమర్చారు.రామాలయం ఎదురుగా ఉన్న నందన వనంలో వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించే విధంగా సౌకర్యాలు సిద్ధం చేశారు.

కడపకు వరుస విజయాలు



57 పరుగులు చేసిన బ్యాట్స్‌మన్ తాహీర్

కడప స్పోర్ట్స్: కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు వరుస విజయాలతో దూసుకుపోతోంది. గురువారం వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కర్నూలు జట్టు 34.3 ఓవర్లలో 139 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. కడప బౌలర్ రుత్విక్ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 26.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని తాహీర్ 57 పరుగులు చేశాడు.

అనంత జట్టు విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. అనంతపురం జట్టు 75 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

విద్యుత్ బకాయిలు చెల్లించని వారి కనెక్షన్లు తొలగించాలి

సిద్దవటం: విద్యుత్ బకాయిలు చెల్లించకుండా ఎవరైతే ఉంటారో అలాంటి వారి విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేశామని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్. రమణ తెలిపారు. గురువారం ఆయన సిద్దవటం మండలం లోని లింగంపల్లె సబ్ స్టేషన్‌ను, సిద్దవటం లోని ట్రాన్స్‌ఫార్మర్‌లను, విద్యుత్ లైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం సిద్దవటం లోని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగ దారులకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం కింది నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సిద్దవటం మండలం లో రూ. 7.76 కోట్ల విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన లైన్‌మెన్ సుబ్బారెడ్డి, సతీష్‌రెడ్డిలను సత్కరించారు.

కోడి పందేలు నేరం

కడప సెవెన్‌రోడ్స్ కోడిపందేలు నిర్వహించడం నేరమని.. అలాగే పశువులను హింసించినా, బహిరంగ ప్రదేశంలో వధ చేసినా, అక్రమంగా తరలించినా నేరంగా పరిగణించి చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించడం (ప్రివెంటేషన్ ఆఫ్ క్రూసిల్టి టు అనిమల్స్) సంబంధిత అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోడిపందాల నిషేధంపై చట్టాలొచ్చాయన్నారు. కొన్ని ప్రాంతాలలో ఈ పందేలను నిర్వహించడం జరుగుతోందని, పందేలను నిషేధం కోసం జిల్లాలోని రెవెన్యూ, పోలీసు శాఖ , పశుసంవర్ధక శాఖ సిబ్బంది తోను కమిటీ ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి శారదమ్మ, డీఈఓ మీనాక్షి, తదితర అధికారులు, ఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలతోనే.. జిల్లా ఆర్థిక ప్రగతి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



డిక్సన్ ఇండస్ట్రీ ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కొప్పర్తి పారిశ్రామిక వాడలోని డిక్సన్ ఇండస్ట్రీ మీటింగ్ హాలులో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనతో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో మౌలిక వసతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశ్రామికవేత్తలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలోని వివిధ పరిశ్రమల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల భద్రత, రవాణా సదుపాయం కోసం సమావేశంలో సభ్యులు జిల్లా కలెక్టర్ ను కోరారు.అంతకుముందు కొప్పర్తి పారిశ్రామిక వాడలోని అన్ని క్లస్టర్లలో నిర్వహణలో, ఏర్పాటు కానున్న వివిధ పరిశ్రమల యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాషా, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఐపివో ఎల్‌డీఎం జనార్ధనం, డీటీసీ డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబర్ శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

గాలి నాణ్యత ప్రమాణాలు పెంపొందించాలి

జిల్లాలో గాలి నాణ్యత ప్రమాణాలను పెంపొందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. గురువారం నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంపై నిర్వహించిన సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినచర్యలు

కడప సెవెన్‌రోడ్స్: లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా వైద్య, పీజీఆర్ఎస్ సమావేశ హాలులో డీఎంహెచ్ఓ నాగరాజు అధ్యక్షతన పీసీ పీఎన్డీటీపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. గర్భస్రావాలు జరగకుండా ఆపాలని, అందుకోసం ప్రచారం, అవగాహన కల్పించాలన్నారు.

అప్పుడూ.. అంతే!

- 2018లో కోదండ రాముని కల్యాణ వేడుకల్లో అపశృతి
- బాబు సర్కార్‌లోని టీటీడీ లోపభూయిష్ట ఏర్పాట్లతో కూలిన షెడ్లు
- అప్పట్లో నలుగురు మృతి.... 70 మందికి గాయాలు
- ప్రస్తుతం తిరుపతి ఘటన నేపథ్యంలో ఒంటిమిట్టపై చర్చ



ఒంటిమిట్ట ఆలయం వద్ద గాలి వానకు పడిపోయిన టెంట్లు, ఇతర కట్టడాలు (ఫైల్)

సాక్షి రాయచోటి: సర్వం సిద్ధం.. వైభవంగా మరి కొన్ని గంటల్లో శ్రీ కోదండరామస్వామి కల్యాణం జరుగుతుందనుకున్న క్షణంలో.. ఆకాశంలో మబ్బులు కమ్మడం..ఉరుములు, మెరుపులు.. గాలులతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. అంతలోనే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ నుంచి కడపలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకోవడం..ఇక బయలుదేరుతారనుకున్నలోపే ప్రకృతి బీభత్సం సృష్టించింది. ఒంటిమిట్టలో ప్రకృతి సృష్టించిన విలయానికి భక్తులు నిశ్చేష్టులయ్యారు. పిడుగులతో భారీ వర్షం కురుస్తుండగా...స్తంభాలు కూలిపోయి...టీటీడీ ఏర్పాటు చేసిన తాత్కాలిక టెంట్లు లేచిపోయాయి.షెడ్లు, ఇతర కల్యాణ మండప ఆవరణలో ఏర్పాటు చేసిన నిర్మాణాలు కూలిపోవడంతో విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో సాయంత్రం 5.30 నుంచి 8.00 గంటల వరకు చీమ్మచీకట్లు అలుముకున్నాయి. అందరూ తేరుకునేలోపే విషాదం బయటపడింది. కూలిపోయిన షెడ్లు, టెంట్లు, స్తంభాల కింద సుమారు నలుగురైదుగురు మృత్యువాత పడటం, మరో 70 మందికి పైగా గాయపడటం జరిగిపోయాయి. ప్రస్తుతం తిరుమల-తిరుపతి దేవస్థానానికి సంబంధించి వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతిలో టోకన్ల పంపిణీలో జరిగిన అపశృతి వ్యవహారం నేపథ్యంలో మరొకమారు ఒంటిమిట్టలో 2018 మార్చి 30న కల్యాణం సందర్భంగా చోటుచేసుకున్న ఘటనపై చర్చించుకుంటున్నారు.

చరిత్రలో తొలిసారి

ఏకశిలానగరంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆలయ బ్రహ్మోత్సవాల సమయంలో పండు వెన్నెల్లో నిర్వహించడం ఆనవాయితీ. 2014 రాష్ట్ర విభజన అనంతరం ఒంటిమిట్టను అధికారిక క్షేత్రంగా గుర్తించి...తెలంగాణలోని భద్రాద్రి తరహాలో అధికారిక లాంఛనాలతో రాష్ట్ర ప్రభుత్వం శ్రీరామ నవమి వేడుకలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ తరుణంలో ఒంటిమిట్టను టీటీడీలోకి విలీనం చేసి...సుమారు రూ. 100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే స్వామి వారి కల్యాణ వేదిక వద్ద శాశ్వత నిర్మాణాలు అప్పట్లో లేకపోవడంతో తాత్కాలిక చలువ పందిళ్లను మొదలుకొని ఇతర ఏర్పాట్లుచేశారు. అనుకోకుండా వచ్చిన గాలి, వర్షం బీభత్సం ధాటికి ఎక్కడికక్కడ కూలిపోవడం..మనుషులు మృతి చెందడం..గాయపడటం ఇప్పటివరకు ఒంటిమిట్ట చరిత్రలో ఎప్పుడూ చోటుచేసుకోలేదు. ఇది తొలిసారిగా చరిత్రలో విషాద ఘటనగా నిలిచిపోయింది.

నరసాపురంలో ఆందోళన

అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం నరసాపురంలో ఆందోళన కొనసాగింది. నరసాపురంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 360 మందికి పైగా వెంకటేశ్వరస్వామి భక్తులు కాలినడకన తిరుపతికి వెళ్లారు. అక్కడ వైకుంఠ ఏకాదశి టోకెన్ల కోసం వీరంతా ప్రయత్నం చేసే క్రమంలో పలువురు గాయపడ్డారు. 9-10 మంది వరకు గాయపడగా, మిగిలిన అందరి ఆచూకీ తెలియాల్సి ఉంది. ఇప్పటికే గ్రామస్తులతోపాటు వెళ్లిన వారు ఒకరినొకరు ఫోన్లు చేసుకుని అందరూ కలుసుకుంటున్నారు. అయితే ఇంకా గ్రామంలో వెళ్లిన వారి గురించి టెన్షన్ వెంటాడుతోంది. ఏది ఏమైనా తిరుపతి సంఘటన గ్రామంలో ఆందోళన నెలకొనేలా చేసింది.

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ
- అన్నమయ్య యూనివర్సిటీ ప్రారంభం



అన్నమాచార్య యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, నటులు బ్రహ్మానందం, కిరణ్ అబ్బవరం, చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి

రాజంపేట: విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం రాత్రి అన్నమయ్య జిల్లా రాజంపేటలోని అన్నమాచార్య యూనివర్సిటీని ప్రారంభించారు. జ్యోతి ప్రజల్వన చేసిన అనంతరతం సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నిరుద్యోగం, పేదరిక నిర్మూలన కావాలంటే విద్యనే దానికి గొప్పటానిక్ అన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో అన్నమాచార్య యూనివర్సిటీ నిర్వహించడం స్వాగతించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగం, పేదరిక నిర్మూలనకు విద్య ఒక ఆయుధంగా చేసుకొని ఉద్యోగాన్వేషణ కాకుండా ఉద్యోగ కల్పనవైపు యువత ముందుకెళ్లాలన్నారు. దేశ ప్రధాని మంత్రి నరేంద్రమోదీ 2020లో నూతన విద్యావిధానం తీసుకొచ్చారన్నారు. భారతదేశ చరిత్రలో నూతన విద్యావిధానం గేమ్ చేంజర్ లాంటిదన్నారు. ప్రపంచంలో 2030లో 3కోట్ల ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు. రెండు కోట్ల మంది భారతీయులు ఉద్యోగం సాధించగలగతారని నమ్మకం ఉందన్నారు.మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు తీసుకెళ్లే వారధులు గురువులు

అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు తీసుకెళ్లే వారధులు గురువులని ప్రముఖ హాస్యనటుడు పద్మశ్రీ బ్రహ్మానందం అన్నారు. గురువు విద్యార్థికి మార్గదర్శకుడన్నారు. విద్యార్థులు మంచి నడవడికతో ఉన్నతశిఖరాలను అధిరోహించాలని గురువులు కోరుకుంటారన్నారు. ప్రయత్నం చేస్తూ ఉండాలని, వెనకడుగు వేయరాదన్నారు. ఇందుకు తానే ఉదాహరణ అన్నారు. ప్రపంచంలో అన్నమాచార్య యూనివర్సిటీని మేటి సంస్థగా మార్చాలని అభిప్రాయపడ్డారు. మరో సినీనటుడు కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో కూడా ఎదో ఒక టాలెంట్ ఉంటుందని, దానిని వెలికితీసినప్పుడు, ఉన్నతస్థాయికి చేరుకోగలరన్నారు. అన్నమాచార్య యూనవర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి మాట్లాడారు.

దత్తాత్రేయ, బ్రహ్మానందం, కిరణ్‌లకు అన్నమయ్య పురస్కారాలు

అన్నమాచార్య యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి విచ్చేసిన గవర్నర్ బండారు దత్తాత్రేయ, హాస్యనటుడు బ్రహ్మానందం, నటుడు కిరణ్ అబ్బవరంలను ఏయూ తరపున చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి, ప్రోచాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి సన్మానించి, అన్నమయ్య పురస్కారాలను అందచేశారు. ఏఐటీఎస్‌లో సుదీర్ఘకాలం సేవలందించిన రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, శివారామిరెడ్డి, పద్మలలిత, రంగనాథం, రామసుబ్బారెడ్డి, సుబ్బరెడ్డిలను లాంగ్‌సర్వీస్ అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ సీ.రామచంద్రారెడ్డి, ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, సబ్‌కలెక్టర్ వైభోమాన్షై దియాదేవి, రజోత్సవ వేడుకల కన్వీనరు డా.జయరామిరెడ్డి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా.సుబ్బారావు, తిరుపతి మాజీఎమ్మెల్యే సోదరుడు భూమనశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న రౌడీ మూకలు

- వేంపల్లెలో శాంతి భద్రతలు కరువు
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న పోలీసులు



బ్యాంకు సర్కిల్ వద్ద గొడవ పడుతున్న రౌడీ మూకలు (ఫైల్‌ఫొటో)



వేంపల్లెలోని టైల్స్ షాపు వద్ద గొడవ పడుతున్న రౌడీ మూకలు (ఫైల్‌ఫొటో)

వేంపల్లె : వేంపల్లెలో సినిమా ఫక్కీలో గ్రూపుల ఆధిపత్యం ఎక్కువైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వేంపల్లెలో శాంతి భద్రతలు కరువయ్యాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యువత గ్రూపులుగా ఏర్పడి మద్యం తాగి రౌడీయిజం చెలాయిస్తున్నారు. మారణాయుధాలు, పిడి బాకులు, నాటు కట్టెలతో ఒక గ్రూపు, మరో గ్రూపుపై దాడులకు పాల్పడుతున్నారు. పట్టణంలో వరుస ఘటనల నేపథ్యంలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

రౌడీలకు అడ్డా సంత మార్కెట్, నాలుగు రోడ్ల కూడలి

పట్టణంలోని సంత మార్కెట్ వీధి, నాలుగు రోడ్ల కూడలి ప్రాంతాలు రౌడీలకు అడ్డాగా మారాయి. ఇక్కడ ఆధిపత్య పోరులో రెండు వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన యువత రెండు గ్రూపులుగా ఏర్పడి రౌడీ మామూళ్లకు శ్రీకారం చుట్టారు. ఏదో ఒకచోట ఈ రెండు గ్రూపులు తలపడుతుండటంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది.

రౌడీ గ్రూపులకు నాయకుల అండ

అధికార పార్టీ నాయకులు ఈ రెండు గ్రూపులను తమ అక్రమ దందాకు పావులుగా వాడుకుంటున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మొన్న మండలంలోని తువ్వపల్లె గ్రామానికి చెందిన వేంపల్లె అజయ్ కుమార్ రెడ్డిపై, నిన్న వేంపల్లెకు చెందిన శ్రీకాంత్ రెడ్డిపై, నేడు వేంపల్లెకు చెందిన కొత్తూరు లోకేష్‌పై జరిగిన దాడులే ఇందుకు నిదర్శనమని పలువురు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇసుక, గ్రావెల్ మట్టి, అక్రమ రవాణా, ప్లాట్లు, స్థల సెటిల్మెంట్లు, ఇతరత్రా దందాల్లో ఈ రౌడీ మూకలతో బెదిరింపులకు పాల్పడుతూ నాయకులు యథేచ్ఛగా తమ అక్రమ దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

పోలీసులు వైఫల్యం

రౌడీ మూకల చర్యలను అరికట్టాల్సిన పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారన్న విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఈ గ్రూపుల రౌడీ దందాను అరికట్టడంలో పోలీసులు పూర్తిగా చేతులెత్తేశారని తెలుస్తోంది. దీనికితోడు రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చే పోలీసులే కరువయ్యారు. దీంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అయింది. ఇప్పటికైనా పోలీసులు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలు ఇలా..

- గత ఏడాది జూలై 5న పులివెందుల రోడ్డులోని రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో వేంపల్లె మండలం తువ్వపల్లె గ్రామానికి చెందిన వేంపల్లె అజయ్ కుమార్ రెడ్డిపై కొందరు రౌడీ మూకలు నాటు కట్టెలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు.
- గత ఏడాది సెప్టెంబర్ 16వ తేదీన కడప రోడ్డులో ఓ యువకుడిని పిడి బాకులతో బెదిరించి దాడికి పాల్పడడంతో అప్రమత్తమై యువకుడు పరారయ్యాడు.
- గత ఏడాది నవంబర్ 11న కడప రోడ్డులో ఉన్న బ్యాంకు సర్కిల్ వద్ద ఒక గ్రూపునకు చెందిన రౌడీ మూకలు వేంపల్లెకు చెందిన శ్రీకాంత్ రెడ్డిపై కొందరు మారణాయుధాలు, నాటు కట్టెలతో దాడికి పాల్పడ్డారు.
- 2025 జనవరి 5వ తేదీన పులివెందుల రోడ్డులో టైల్స్ మాలా షాపు వద్ద వేంపల్లెకు చెందిన కొత్తూరు లోకేష్‌పై కొందరు భౌతిక దాడికి పాల్పడి పరారయ్యారు.
- 2025 జనవరి 6న పాములూరు రోడ్డులో గ్రావెల్ మట్టి అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకున్న రాయల్టీ సిబ్బందిని రౌడీ మూకలు బెదిరించి భౌతిక దాడులకు పాల్పడ్డారు.

గతంలో ఎన్నడూ ఇలాంటి ఘటనలు జరగలేదు



వేంపల్లెలో గత 35 ఏళ్లుగా ఇలాంటి ఘటనలు ఎప్పుడు జరగలేదు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పులివెందుల తర్వాత వేంపల్లెను అభివృద్ధి చేసేందుకు ముందుకు వెళ్లేవారు. ఆర్థికంగా, వాణిజ్యపరంగా వేంపల్లె చాలా అభివృద్ధి చెందింది. అలాంటి తరుణంలో కొందరు అల్లరి మూకలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అధికారులు, అధికార పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించి వేంపల్లెను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని కోరుతున్నాం.
- షేక్ మునీర్ బాషా(స్థానికుడు), వేంపల్లె

అధికారులు చర్యలు చేపట్టాలి



అధికారులు, అధికార పార్టీ నాయకులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. అధికార పార్టీ నాయకుల అండ దండలతోనే ఇలాంటి ఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పోలీసులు అల్లరి మూకల పని పట్టి కౌన్సెలింగ్ ఇవ్వాలి. అభివృద్ధిపైన దృష్టి పెట్టాల్సిందిపోయి వేంపల్లెను ఫ్యాక్షన్ గ్రామంగా తయారు చేస్తున్నారు.
- రాచినేని వేణుగోపాల్(స్థానికుడు), వేంపల్లె

దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేశాం



వేంపల్లెలో శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా పని చేస్తున్నాం. రౌడీ మూకల గురించి సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి నిందితులను స్టేషన్‌కు తరలిస్తున్నాం. కేసులు మోదు చేసి విచారణ చేస్తున్నాం. ప్రజా శాంతికి విఘాతం కలిగించే రౌడీ షీటర్ల బహిష్కరణకు చర్యలు చేపట్టేందుకు వెనుకాడం.
- సురేష్ రెడ్డి(సీఐ) వేంపల్లె

క్లుప్తంగా

పిచ్చికుక్క దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బారెడ్డి

గోపవరం : మండలంలోని రాచాయపేట పంచాయతీ బెడుసుపల్లె గ్రామానికి చెందిన పల్లెం సుబ్బారెడ్డిపై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ఒక్కసారిగా పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు గాయపడిన సుబ్బారెడ్డిని బద్వేలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా రాచాయపేట పంచాయతీ పరిధిలోని రాచాయపేట, బెడుసుపల్లె గ్రామాల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.

బ్రహ్మంసాగర్‌లో పడి వృద్ధుడి మృతి



బ్రహ్మంసాగర్‌లో పడి మృతి చెందిన రామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం సమీపంలోని బ్రహ్మంసాగర్‌లో గురువారం వీరపునాయునిపల్లె మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన రామిరెడ్డి(78)అనే వృద్ధుడు మృతి చెందాడు. బ్రహ్మంసాగర్‌లో వృద్ధుడి మృత దేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ గురప్ప సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వృద్ధుడి భార్య చనిపోవడంతో మనశ్శాంతి కోసం గండి, ఓబుళం, బ్రహ్మంగారి మఠం ప్రాంతాల్లో తిరిగేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం బ్రహ్మంగారిమఠం వచ్చి బ్రహ్మంసాగర్‌లో పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడి దుర్మరణం

కడప అర్బన్ : కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ సమీపంలో బ్రిడ్జి వద్ద ఉన్న విద్యుత్ తీగలు తగిలి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. కడప తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంజీవకుమార్ (23) కడపలో గత రెండేళ్ల నుంచి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ట్రాన్స్‌పోర్టు వెనుక భాగంలో పనిచేస్తున్న సమయంలో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. మృతుని బంధువులకు సమాచారం ఇచ్చామని వారు వచ్చిన తరువాత ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఐదుగురికి యావజ్జీవ కారాగార శిక్ష



పోలీసుల అదుపులో ముద్దాయిలు

మైలవరం : మైలవరం మండల పరిధిలోని తొర్రివేముల గ్రామం వద్ద ఐదేళ్ల క్రితం జరిగిన హత్య కేసులో ఐదుగురికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 2 లక్షల జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు సెకండ్ ఏడీజే కోర్టు తీర్పు ఇచ్చింది. మైలవరం ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుమ్మరి గురుప్రసాద్ భార్య ప్రమీలకు తీట్ల సురేష్ (ఆటో సూరి)తో వివాహేతర సంబంధం ఉండేది. దీంతో భర్త గురు ప్రసాద్ భార్య ప్రమీలను మందలించాడు. తమ వివాహేతర సంబంధానికి అడ్డు తగులుతున్నాడనే ఉద్దేశంతో 2019 సంవత్సరం జనవరి 24వ తేదీన గురుప్రసాద్‌ను తొర్రివేముల గ్రామ పరిధిలోని బాబాసాబ్ బావి వద్ద కాపు కాసి రాడ్లతో కొట్టి హత్య చేశారు. దీనిపై మైలవరం పోలీసులు తీట్ల సురేష్ (ఆటో సూరి), కొమ్ము పెద్దిరాజు, చాకలి గురుస్వామి, ఉప్పలపాడు ఓబుల్ ప్రతాప్, కుమ్మరి విజయ ప్రమీలపై కేసు నమోదు చేశారు. ఐదేళ్ల తర్వాత నేరం నిరూపితం కావడంతో ముద్దాయిలకు గురువారం ప్రొద్దుటూరు ఏడీజే కోర్టు జీవిత ఖైదు, రూ.2 లక్షల రూపాయల జరిమానా విధించింది.

కారు, ద్విచక్రవాహనం ఢీ

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లె సమీపంలో కడప–బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఏజాస్ అలీఖాన్((30) మృతి చెందారు. కర్ణాటకకు చెందిన వారు కారులో రాయచోటి నుంచి బెంగళూరు వైపు వస్తుండగా గుర్రంకొండ నుంచి రాయచోటి వైపు ద్విచక్రవాహనంలో వస్తున్న ఏజాస్ అలీఖాన్‌ను ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న రాజు, రత్నమ్మ తీవ్రంగా గాయపడ్డారు.

భారీగా అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

183 రేషన్ బస్తాల బియ్యం, ఐచర్ వాహనం స్వాధీనం



అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు, సిబ్బంది

వేంపల్లె : మండలంలోని టి.వెలమవారిపల్లె గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు నారాయణ, శివన్నలు పట్టుకున్నారు. గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఎస్ఐ రంగారావు, విజిలెన్స్ డీటీ సుధీర్‌లతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు టి.వెలమవారిపల్లె గ్రామ సమీపంలో అక్రమంగా 183 రేషన్ బస్తాలను ఐచర్ వాహనంలో తీసుకెళ్తుండగా, వాటిని గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వేంపల్లిలోని పౌరసరఫరాల శాఖ గౌడన్‌కు తరలించామన్నారు. వేంపల్లె పరిసర ప్రాంతాల ప్రజల నుంచి అనంతపురం జిల్లా ధర్మవరం గ్రామానికి చెందిన శ్రీనివాసులు రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఐచర్ వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ హరినాథ్ రెడ్డి, ఆర్ఐ లోకేష్, వీఆర్‌ఓలు ఓబయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బైకులు ఢీ

నందలూరు : కడప–చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు కన్యకా చెరువుకట్టపై గురువారం సాయంత్రం రెండు బైకులు ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సోమేశుల హరికృష్ణ (28) తన మోటారు బైకుపై కడప వైపు వెళ్తుండగా మంటపంపల్లి సమీపంలోని కోనరాజుపల్లి గ్రామానికి చెందిన ఈర్ల వేణుగోపాల్, ఈర్ల రాజశేఖర్‌లు నందలూరువైపు వస్తుండగా రెండు బైకులు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే సోమేశుల హరికృష్ణ మృతి చెందాడు.

బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలను పునరుద్ధరించండి



మాట్లాడుతున్న ఎస్.రఘునాథరావు, ప్రసాదరావు

వేంపల్లె : గతంలో తెలుగుదేశం పార్టీ 2014 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటు చేసిన బ్రాహ్మణ కార్పొరేషన్ ఎన్నో పథకాల ద్వారా బ్రాహ్మణులకు లబ్ధి చేకూర్చిందని, అవే పథకాలను పునరుద్ధరించాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కమిటీ ప్రచార అధ్యక్షుడు ఎస్.రఘునాథరావు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాదరావు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. గురువారం వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా కార్పొరేషన్ నిర్వీర్యమైపోయిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.270 కోట్లు కేటాయించడం హర్షణీయమని, అయితే ఆ నిధులకు తగ్గట్లుగా పథకాలు అమలు చేయాలని కోరారు.

ఆధునిక వైద్య పరిశోధనల కోసం ప్రత్యేక గుర్తింపు



ఎథికల్ కమిటీ గుర్తింపు పత్రాన్ని చూపుతున్న రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్ : కడపలోని ప్రభుత్వ వైద్యకళాశాల, ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరిశోధనలు జరుపుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఇన్‌స్టిట్యూషనల్ ఎథికల్ కమిటీకి జాతీయ స్థాయిలో సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఢిల్లీ నుంచి ప్రత్యేక గుర్తింపు లభించిందని జీఎంసీ (రిమ్స్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ తెలిపారు. ఈ గుర్తింపు ద్వారా అకడమిక్ రీసెర్చ్ ఆక్టివిటీస్ మరింతగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఎథికల్ కమిటీ రిజిస్ట్రేషన్ అనేది చాలా కొద్ది కళాశాలలకు మాత్రమే లభించే అరుదైన గుర్తింపు అన్నారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా జనరల్ సర్జన్ డాక్టర్ గిరిధర్, కార్యదర్శిగా అనస్థీషియా హెచ్‌ఓడీ డాక్టర్ సునీల్ వ్యవహరిస్తారన్నారు. కమిటీ ఏర్పాటుకు కృషి చేసిన అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ నాగశ్రీలత పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీతోనే యువతకు ఉద్యోగాలు

రాయచోటి అర్బన్ : కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం ద్వారానే రాయలసీమ జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు పేర్కొన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ప్రథమ మహాసభలు అధ్యక్షుడు జక్కల వెంకటేష్ అధ్యక్షతన రాయచోటి పట్టణంలో జరిగాయి. ఈ సభలకు హాజరైన ఆయన మాట్లాడుతూ రాయలసీమలో పరిశ్రమలు లేక యువత వలస పోతున్నప్పటికీ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

పోలీసుల వేధింపులతో రైతు ఆత్మహత్యాయత్నం

లింగాల : లింగాల మండలం దొండ్లవాగు గ్రామానికి చెందిన గంగిరెడ్డి బాలగంగిరెడ్డి అనే రైతు గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలలోకి వెళితే.. బుధవారం గ్రామ ఉద్యాన అధికారి(వీహెచ్‌ఏ) హరిత గ్రామంలో ఈ–క్రాప్ నమోదు కోసం వెళ్లారు. ఈ క్రమంలో బాల గంగిరెడ్డి పొలంలో సాగు చేసిన శనగ పంటను ఈ–క్రాప్ బుకింగ్ చేశారు. ఆయనకు 2 ఎకరాల పొలం ఉన్నా, 30 సెంట్లలో శనగ పంట సాగు చేశారు. 30 సెంట్లకే ఈ–క్రాప్ నమోదు చేశారు. అయితే తనకు 2 ఎకరాల పొలం ఉండగా, 2 ఎకరాలకు ఈ–క్రాప్ చేయాలని వీహెచ్‌ఏ హరితను కోరారు. అలా చేయడానికి వీలుకాదని, మేం చేయలేమని హరిత అన్నారు. అయితే గ్రామంలో కొంతమంది రైతులవి పంట సాగు చేయకపోయినా సాగు చేసినట్లు ఈ–క్రాప్ నమోదు చేసుకున్నారని ఆమెతో ఆ రైతు వాదించాడు. దీంతో ఆమె గ్రామంలోని టీడీపీ నాయకుడికి ఫోన్ చేసి రైతు ఈ విధంగా వాదిస్తున్నాడని తెలిపారు. బాల గంగిరెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యకర్త కావడంతో ఆ టీడీపీ నాయకుడు ఫోన్ ద్వారా పోలీసులకు తెలియజేశాడు. దీంతో బుధవారం బాల గంగిరెడ్డిని లింగాల పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. గురువారం కూడా పోలీస్ స్టేషన్‌కు రావాలని బాల గంగిరెడ్డికి తెలిపారు. పోలీసులు కొడతారని, వేధిస్తారని భయపడిన రైతు ఇంట్లోకి వెళ్లి మెడకు తాడు బిగించుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి అతన్ని కడప ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ మధుసూదనరావును వివరణ కోరగా.. ఆ విషయం తనకు తెలియదని, మూడు రోజులుగా తిరుపతిలో ఉన్నానని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న పోలీసులను వివరణ కోరగా.. బాల గంగిరెడ్డి బుధవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చాడని, అయితే గురువారం తాము పోలీస్ స్టేషన్‌కు రమ్మనలేదని చెప్పారు. ఈ విషయమై బాలగంగిరెడ్డి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తాము వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కావడం వల్లే టీడీపీ నాయకుల సూచనల మేరకు పోలీసులు తమను వేధించారన్నారు. వ్యవసాయాధికారి రమేష్‌ను వివరణ కోరగా తాము పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని బాల గంగిరెడ్డి పొలం వద్ద ఎలాంటి ఘర్షణ జరగలేదని, వీహెచ్‌ఏ హరితను బాల గంగిరెడ్డి దుర్భాషలాడలేదని, వాగ్వాదం జరగలేదని తెలిపారు. అతన్ని పోలీసులు ఎందుకు పిలిపించారో కూడా తమకు తెలియదన్నారు.

నిర్ణీత గడువులోగా రైల్వే అభివృద్ధి పనులు

డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా



పనులను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న గుంతకల్లు డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా

కడప కోటిరెడ్డిసర్కిల్ : అమృత్ భారత్ పథకంలో భాగంగా కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను నాణ్యత పరంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని గుంతకల్లు డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా ఆదేశించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీఆర్‌ఎం కడప, రాజంపేట రైల్వేస్టేషన్లలో జరుగుతున్న పనుల పరిశీలన నిమిత్తం గురువారం వచ్చారు. తొలుత ఆయన కడప నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. అందులో భాగంగా పనులు ఏ మేరకు పూర్తయ్యాయో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎస్కలేటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏ ప్రాంతంలో వస్తుందో తెలుసుకున్నారు. అనంతరం మ్యాప్‌ను పరిశీలించి ఆయా పనుల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ఈ పనులను ఈ ఏడాది డిసెంబరులోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఆ దిశగా అధికారులు పనులను పర్యవేక్షించాలని సూచించారు. అలాగే నాణ్యత పరంగా రాజీలేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ చంద్రశేఖర్, సీనియర్ డీఈఎన్ అభిరామ్, కడప స్టేషన్ మేనేజర్ శేఖర్‌కుమార్, ఏడీఎన్ రాధాకృష్ణ, ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఏడీఎస్‌టీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుమల చరిత్రలో ఘోర అపచారం



విలేకరులతో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మాజీ సభ్యులు మాసీమ బాబు, యానాదయ్య

కడప కార్పొరేషన్ : తిరుమల చరిత్రలో ఘోర అపచారం జరిగిందని, వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో ఆరుగురు భక్తులు మృతి చెందడం, వందల మంది గాయాలపాలవడం విచారకరమని టీటీడీ బోర్డు మాజీ సభ్యులు మాసీమ బాబు, యానాదయ్య అన్నారు. గురువారం కడపలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీస్తోందని, ఇదివరకు పవిత్రమైన లడ్డూ కల్తీ జరిగిందని వ్యాఖ్యలు చేసి భక్తుల మనోభావాలను గాయపరిచారన్నారు. తాజాగా పాలకమండలి చేతగానితనం వల్ల ఈ ఘటన జరిగిందన్నారు. పవిత్రమైన వైకుంఠ ఏకాదశి నాడు సర్వదర్శనాన్ని నిలిపివేయడం దారుణమన్నారు. గంటలకొద్దీ భక్తులను వేచి ఉండేలా చేసి ఒక్కసారిగా వదలడం వల్లే తొక్కిసలాట జరిగిందన్నారు. దీనికి కారణమైన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి మునిశేఖర్‌రెడ్డి, బాలకొండయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నరసింహులు మృతదేహం

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డీఈఓ కార్యాలయం సమీపంలోని మురికి కాలువలో పడి సిద్దవటం మండలం బోడిశెట్టిపల్లె గ్రామానికి చెందిన పోలుబోయిన నరసింహులు (33) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. చిన్నచౌక్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిద్దవటం మండలానికి చెందిన నరసింహులు ఎంటెక్ వరకు చదువుకున్నాడు. కడపలోని ఓంశాంతి నగర్‌లో నివాసం ఉంటూ చిన్నచిన్న పనులను చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం తల్లి వీరమ్మ సొంత ఊరికి పనిమీద వెళ్లింది. ఈ క్రమంలో నరసింహులు మృతదేహమై గురువారం బయటపడ్డాడు. మూడు రోజుల క్రితమే కాలువలో మృతదేహమై పడి ఉండటం, దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు పంపించారు. అతను ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఇతర కారణాల వలన చనిపోయాడా? అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేజీబీవీలో సిబ్బంది మధ్య విభేదాలు

ప్రిన్సిపల్‌కు షోకాజ్ నోటీసు



చక్రాయపేటలోని కేజీబీవీ పాఠశాల

చక్రాయపేట: మండలంలోని కేజీబీవీ పాఠశాలల్లో కొందరు ఉపాధ్యాయుల వర్గ పోరు కారణంగా విద్యార్థినులు నలిగిపోతున్నారు. ఒకరితో మాట్లాడితే మరొకరికి కోపంగా ఉండటంతో ఎవరికి చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు బిడ్డల బాధచూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల చివరి వారంలో చక్రాయపేట కేజీబీవీని ఎస్ఎస్ఏ జీసీడీఓ అనిత ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాఠశాల సిబ్బంది జీసీడీఓ ఎదుటే గొడవ పడినట్లు సమాచారం. పాఠశాలలో లోపాలను ఎత్తి చూపుతూ జీసీడీఓ స్థానిక ప్రిన్సిపల్‌కు షోకాజ్ నోటీసు కూడా జారీ చేశారు.

పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం, సిబ్బంది రెండు గ్రూపులుగా విడిపోయి నిత్యం గొడవలు పడటం, సిబ్బందిని సమన్వయ పరచుకోవడంలో ప్రిన్సిపాల్ విఫలం కావడమే కాకుండా ఓ వర్గానికి మద్దతు పలకడం తదితర కారణాలను చూపుతూ ఆ నోటీసులో సంజాయిషీ కోరారు. ఈవిషయంపై జీసీడీఓ అనితను వివరణ కోర షోకాజ్ నోటీసు జారీ చేసిన విషయం వాస్తవమేనన్నారు. నోటీసు విషయంపై ప్రిన్సిపాల్ గౌస్ ప్యారీని అడుగగా విభేదాలు అంటూ ఏమీ లేవని చెప్పారు.

అంతర్జాతీయ జంప్ రోప్ పోటీల్లో మైదుకూరు విద్యార్థికి పతకాలు

మైదుకూరు : నేపాల్‌లో జరిగిన అండర్ 17 అంతర్జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీల్లో మైదుకూరు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌కు చెందిన హరీష్ అనే విద్యార్థి బంగారు, వెండి పతకాలను సాధించాడు. నేపాల్‌లో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు ఇండో–నేపాల్ జంప్ రోప్ ఇంటర్నేషనల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఇండియా నుంచి 30 మంది సభ్యులు గల టీం జంప్ రోప్ పోటీల్లో పాల్గొన్నట్టు మైదుకూరు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రావతి, వినోనియా రాణి తెలిపారు. గత ఏడాది ఏప్రిల్‌లో మధ్యప్రదేశ్‌లో జాతీయ స్థాయి పోటీలు జరగగా అక్కడ ప్రతిభ చూపి హరీష్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. దీనిపై పాఠశాల హెడ్మాస్టర్ గోశెట్టి రామమోహన్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.